అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 26 జనవరి 2023

ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం వంద శాతం పూర్తి

నవతెలంగాణ-జైపూర్



ఇందారం గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రం-2 పరిధిలో నూటికి నూరుపాళ్లు ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం పూర్తయింది. జిల్లా పరిధిలో 100 శాతం ఆధార్ అనుసంధానం చేసిన బెస్ట్ బీఎల్ఓగా ఇందారం-2 అంగన్వాడీ కార్యకర్త గడ్డం సౌజన్య గుర్తింపు పొందారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ భారతిహోళికేరి చేతుల మీదుగా ఆమె ప్రశంసా పత్రం అందుకుంది.

వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన ప్రకారం..కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన పుష్పలత(30)తో కాగజ్‌నగర్‌కు చెందిన పోలవేన రమేష్‌కు వివాహం జరిగింది. వీరికి పిల్లలు కలగకపోవడంతో భర్త రమేష్‌తో పాటు అన్న, వదిన రాజమౌళి, స్వరూప, తల్లి మల్లమ్మ పుష్పలతను వేధించడం ప్రారంభించారు. ఈ వేధింపులు భరించలేక పుష్పలత అర్ధరాత్రి భర్త నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రెడ్డి సారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్త మల్లమ్మ భర్త రమేష్, అతని అన్నా, వదిన రాజమౌళి, స్వరూపపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

జీతం రాక..పూట గడువక..!

- 300ఓసీఎస్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల దీనస్థితి
- ఎనిమిది నెలలుగా అవస్థలు పడుతున్న వైనం
- కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన
- సమస్య వివరించినా దృష్టిసారించని ప్రభుత్వం

చేసిన కష్టానికి ఒక నెల జీతం రాకపోతేనే నెలాఖరులో పూట గడవడం కష్టంగా ఉంటుంది. అలాంటిది ఒకటి కాదు..రెండు కాదు ఏకంగా ఎనిమిది నెలల పాటు జీతం రాలేదు. వీరి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నది ఎవరో కాదు..ప్రజల ఆరోగ్యాన్ని బాగుచేసేందుకు నిరంతరం కృషిచేస్తున్న 300ఓసీఎస్ స్టాఫ్ నర్సులది. నెలల తరబడి వేతనం రాకపోయినా ఆర్థిక కష్టాలు భరిస్తూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించారు. నోరెత్తి మాట్లాడితే ఎక్కడ ఉద్యోగం నుంచి తొలగిస్తారోనని భయపడుతూ విధులు నిర్వర్తించారు. ఎంతకీ వారికి వేతనాలు రాకపోవడంతో ధైర్యం కూడగట్టుకొని ఉన్నతాధికారుల వరకు విషయం చేరవేశారు. వీరికి సీఐటీయూ నాయకులు అండగా నిలవడంతో రిమ్స్ ఎదుట వేతనాలు మంజూరు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రిమ్స్ ఆస్పత్రిలో గత నాలుగేండ్లుగా పనిచేస్తున్న 300ఓసీఎస్ స్టాఫ్ నర్సులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. 2018లో ప్రభుత్వ కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా 42మంది ఎంపికయ్యారు. ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు సేవలందిస్తున్నారు. రెగ్యూలర్ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెలా ప్రభుత్వం నుంచి వేతనాలు పొందాల్సి ఉంటుంది. కానీ ఇందుకు పరిస్థితి ఇందుకు భిన్నంగా జరుగుతోంది. రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా జీతం ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ ఏడాది ఏకంగా మే నెల నుంచి ఇప్పటి వరకు ఎనిమిది నెలలుగా వేతనం రావడం లేదు. మరో నాలుగు రోజులు గడిస్తే తొమ్మిది నెలలు పూర్తికావస్తున్నా జీతం మాత్రం జాడ లేకుండా పోయింది. ఈ నెలకు వస్తుంది..ఆ నెలకు వస్తుందనే ఆశతో ఉన్నప్పటికీ వారి ఆశలు మాత్రం నెరవేరలేదు.



కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల ఆందోళన(ఫైల్)

నెలల తరబడి జీతం రాకపోయినా ఎలాంటి నిరసన చేపట్టలేదు. ఎక్కడ ఉద్యోగం నుంచి తొలగిస్తారోననే భయంతో మిన్నకుండిపోయారు. ఈ విషయం సీఐటీయూ నాయకులకు తెలియడంతో వారికి అండగా నిలబడ్డారు. రిమ్స్ ఎదుట నిరసన చేపట్టడంతో రిమ్స్ అధికారులు వచ్చి వేతనం వస్తుందని భరోసా ఇచ్చారు.

పూట గడువక ఇబ్బందులు..!

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేసే ఉద్యోగులకు వచ్చేది అరకొర వేతనమే. అది కూడా ఎప్పుడొస్తుందో తెలియకపోతే వారి కుటుంబ పోషణ కష్టంగా మారుతోంది. చిరుద్యోగులకు ఒక నెల కాస్త ఆలస్యమైతేనే కుటుంబ ఆర్థిక పరిస్థితులు తారుమారవుతుంటాయి. అలాంటిది ఈ నర్సులకు ఏకంగా ఎనిమిది నెలల నుంచి వేతనం జాడ లేకుండా పోవడంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇంటికి అవసరమయ్యే సరుకుల కొనుగోలు, పిల్లల స్కూల్ ఫీజులు, విద్యుత్ బిల్లులు చెల్లించడంతో పాటు ఇంటి అద్దె, వైద్య పరమైన అవసరాలు తీర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇంటి అద్దె చెల్లించే పరిస్థితి లేకపోవడంతో యజమానుల నుంచి ఎదురయ్యే ఒత్తిడితో ఇబ్బందులు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పిల్లలకు పౌష్టికాహారం కూడా అందించలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలు అందజేయాలని కోరుతున్నారు.

ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం : భూపెల్లి వసంతరాణి, స్టాఫ్ నర్సు



ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల ఫీజులు, ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితి ఉంది. పూట గడవటం కష్టంగా మారింది. పిల్లలకు పౌష్టికాహారం కూడా పెట్టలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి తమ వేతనాలు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

వేతనాలు వెంటనే చెల్లించాలి : అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



రిమ్స్‌లో పనిచేస్తున్న 300ఓసీఎస్ స్టాఫ్ నర్సులకు ఎనిమిది నెలలుగా జీతాలు రాకపోవడం సరైందికాదు. ప్రభుత్వం వెంటనే వారికి వేతనాలు చెల్లించాలి. వీటితో పాటు సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలి. వీరి ఉద్యోగాలను రెగ్యూలర్ చేయాలి. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

మూడు రోజుల్లో వేతనాలు వస్తాయి : జైసింగ్‌రాథోడ్, రిమ్స్ డైరెక్టర్



స్టాఫ్ నర్సులకు చెల్లించాల్సిన వేతనాల విషయమై ఇది వరకే డీఎంఈ, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఈ సమస్యపై రెగ్యూలర్‌గా సంప్రదింపులు జరుపుతున్నాం. రెండు, మూడు రోజుల్లో వేతనాలు వస్తాయి.

విజయవంతంగా ప్రత్యేక ఓటరు నమోదు

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

క్షేత్ర స్థాయి సిబ్బంది సహకారంతో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఓటు హక్కు కలిగి ఉండాలని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు తన పేరును ఓటర్‌గా నమోదు చేసుకోవాలని అన్నారు. జిల్లాలో 4,26,067 మంది ఓటర్లు ఉన్నారని, జెండర్ రేషియో 1036, ఈపి రేషియో 669 ఉందని వివరించారు. ఇందులో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, సీనియర్ సిటిజెన్‌లను ఓటర్లుగా నమోదు చేశామన్నారు. సామజిక మాధ్యమాల ద్వారా ఓటర్ నమోదుపై విస్తృత ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అర్హత గల వారిని ఓటర్‌గా నమోదు చేయడంతో పాటు క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఈఆర్‌ఓల సహకారంతో ఓటర్ నమోదు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈపి రేషియో పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఓటర్ జాబితా సిద్ధం చేయడంలో క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఓటు వేసే విధంగా ఓటు హక్కు కల్పించడం మన కర్తవ్యమని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ అత్యంత ప్రతిభ, మిషనరీ కలిగిన ప్రజాస్వామ్య దేశం మనదని, ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవడం మన కర్తవ్యమని అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించి నమోదు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన బూత్ స్థాయి అధికారులను, ఏఈఆర్‌ఓలను, దివ్యంగా, సీనియర్ సిటిజన్ ఓటర్లను సత్కరించారు. అంతకుముందు ఎన్నికల కమిషన్ రూపొందించిన పాట, ముఖ్య ఎన్నికల కమిషనర్ ప్రసంగాలను ప్రదర్శించారు. సమావేశానికి హాజరైన సిబ్బంది, విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు కలెక్టర్ ఆవరణలో విద్యార్థులతో నిర్వహించిన ఓటర్ అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మణ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వసంత పంచమికి ఏర్పాట్లు పూర్తి

- పట్టు వస్త్రాలు సమర్పించినున్న మంత్రి అల్లోల దంపతులు
- ప్రత్యేక అక్షరాభ్యాస క్యూలైన్ ఏర్పాటు

నవతెలంగాణ-బాసర

సుప్రసిద్ధ క్షేత్రం బాసర జ్ఞాన సరస్వతిదేవి సన్నిధిలో వసంత పంచమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. గురువారం తెల్లవారు జామున ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక అర్చన పూజలు నిర్వహించి మూడు గంటల నుండి ఆలయ సన్నిధిలోని ప్రత్యేక అక్షరాభ్యాస మండపాలలో అక్షరాభ్యాస పూజలను ఆలయ అర్చకులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వేయి రూపాయల అక్షరాభ్యాస మండపాలు మూడు ఏర్పాటు చేశామన్నారు. దర్శన, అక్షరాభ్యాస పూజలకు వచ్చే భక్తులు చిన్నారులకు దాతల సహకారంతో ఉచితంగా పాలు బిస్కెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రత్యేకంగా మూడు చోట్ల వాహన పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సరిపడా లడ్డూ పులిహోర అందుబాటులో ఉంటుందని, ఉచిత అన్నదాన నిర్వహణ మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి అల్లోల దంపతులు

వసంత పంచమి శుభ ముహూర్తాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అమ్మవార్లకు ఉదయం 7 గంటలకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. అఖిల భారత పద్మశాలీయ అన్న సత్రం తరపున సంఘం సభ్యులు వసంతం పంచమిని పురస్కరించుకొని మొదటిసారిగా చేనేత మగ్గంపై తయారుచేసిన పట్టుచీరలను బుధవారం ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లకు సమర్పించారు. పద్మశాలి సంఘ సభ్యులు అన్నసత్ర భవనం నుండి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి



ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారికి అందజేశారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి అన్నసత్ర అధ్యక్షుడు రాపోలు సుధాకర్, చిలువేరు కాశీనాథ్, గుజ్జేటి రాజేశ్వరి, వెంకటనర్సయ్య, కర్నాటి పాండు, కొక్కుల గంగాధర్, గెంటిల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం : కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని తుంపెల్లి గ్రామంలో తుంపెల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, ఎంపీటీసీ సావిత్రి మల్లేష్, నాయకులు రాపర్తి కార్తీక్, తుంపల్లి యూత్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు అక్రమ నిర్మాణాలు తొలగించాలి

నవతెలంగాణ-నస్పూర్

జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా ఇరువైపులా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అన్నారు. బుధవారం జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మాణాలు చేపట్టిన వారితో మున్సిపల్ కార్యాలయంలో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి డిఈఈ భావ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని తోళ్లవాగు నుండి శ్రీరాంపూర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, ఇరువైపులా అక్రమంగా నిర్మించిన కట్టడాలను రోడ్డు భద్రతలో భాగంగా తీసివేయాలని వ్యాపారులకు, ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. నోటీస్ అందిన వారం రోజుల్లోపు తీసివేయాలని అన్నారు. ఈ విషయంలో ఎవరైనా అశ్రద్ధ వహించి సకాలంలో కట్టడాలను తొలగించని యెడల పురపాలక సంఘ చట్టం 2019, సెక్షన్ 185, సబ్ సెక్షన్(4) ప్రకారం కూల్చివేయబడతాయని తెలిపారు. ఈ విషయంలో జరిగే నష్టానికి పూర్తి బాధ్యత యజమానులేదని పేర్కొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ - జైనూర్

ఏజెన్సీ ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని లింగాపూర్ మండల రైతు సంఘం నాయకులు కేంద్రె నాత్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు లింగాపూర్ మండలంలోని మామిడిపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల వంజారిగూడ గ్రామానికి చెందిన సుమారు 150 మంది రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాల నుండి ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వంజారి కులానికి చెందిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి ఆధారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, క్రాప్‌లోన్ లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, కానీ తమకు అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

27న 'నిధి ఆప్‌కే నికత్' అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలలో 'నిధి ఆప్‌కె నికత్' (పీఎఫ్ మీ ముంగిట) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ సెల్వత్కర్ థానయ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌లో శాంతినగర్‌లోని పద్మశాలి భవన్‌లో, నిర్మల్‌లో మయూరి హోటల్‌లో, మంచిర్యాలలో సురభి హోటల్‌లో, కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో పద్మశాలి భవన్‌లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల పరిధిలోని కార్మిక సంఘాలు, పరిశ్రమల యాజమాన్యాలు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 5-45 నిమిషాల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేరుగా రాని వారు ఈ మెయిల్ ద్వారా ఆర్ఓ.కరీంనగర్ ఎట్‌ద రేట్ ఆఫ్ ఈపీఎఫ్ఇండియా.జీఓవీ.ఇన్ ద్వారా తమ ఫిర్యాదులను పంపవచ్చని సూచించారు.

బాధలో ఉన్నవారికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ - జైనూర్

బాధలో ఉన్న వారికి తన వంతు సహకరిస్తానని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ గణేష్ రాథోడ్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మర్కగూడ గ్రామానికి చెందిన మడావి భీంరావును బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భయాందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలన్నారు. వైద్యుల సూచన మేరకు సరైన సమయంలో మందులను వాడాలన్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఎలాంటి సమస్యలున్నా తనకు ఫోన్ చేయాలని, తనవంతు అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా కల్పించారు.

వాంకిడి బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-వాంకిడి

అఖిలపక్షం పిలుపు మేరకు మండల కేంద్ర బంద్ బుధవారం విజయవంతమైంది. వ్యాపార సముదాయాలు మూసివేయడంతో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. అనంతరం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ తుకారాం మాట్లాడుతూ మండల కేంద్రంలో నేషనల్ హైవే ఏర్పాటు చేస్తున్న నాలుగు వరుసల రహదారిలో భాగంగా అండర్ పాస్ వంతెనను స్థానిక చౌరస్తాలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఆదివారం రాస్తారోకో నిర్వహిస్తున్న సమయంలో బుధవారం వస్తానని చెప్పిన నేషనల్ హైవే పీడీ రాకపోవడంతో అఖిలపక్షం నాయకులు పీడీతో ఫోన్‌లో మాట్లాడారు. తీర్మాన కాపీని పంపాలని కోరడంతో జిల్లా కలెక్టర్‌తో పాటు పీడీకి తీర్మాన కాపీని పంపించామని తెలిపారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, సీపీఐ నాయకులు గోపీనాథ్, మోర్కార్ అశోక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలికల విద్యతో దేశం అభివృద్ధి చెందుతుందని, వారి చదువుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్‌లో జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని 'బాలికలను చదివిద్దాం - బాలికలను ఎదగనిద్దాం' కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల చదువు ద్వారా కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల చదువు కోసం వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి రక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. బాలికల రక్షణ కొరకు షీ టీమ్స్, సఖి కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్వహించడం జరుగుతుందని, బాలికలను లింగ వివక్ష లేకుండా అన్ని రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహాల నివారణ కోసం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాలికలు దేశం కోసం పోరాడిన వీరవనితలను ఆదర్శంగా తీసుకొని విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ శకుంతల, సఖి కేంద్రం సౌజన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని సందేశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 27న ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించే పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఆయన పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి ఈ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రధాని రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిళ్లను తగ్గించేందుకు ఈ పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా స్వయంగా ప్రధాని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయనున్నారనీ, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు ఈ నెల 27న బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అరుణ్‌లోయ, కుమ్మరి తిరుపతి, మందాడె సుధాకర్, కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్



ప్రగతి స్టేడియంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పరిశీలించారు. తగు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, డీజీఎంలు పి గోవిందరాజు, శివరావు, చంద్రశేఖర్‌రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఎస్ఈ సతీష్‌చక్రవర్తి, సివిల్ ఇంజనీర్ గుండెరావు, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీలు పూర్వ పద్ధతిలో కొనసాగించాలి

నవతెలంగాణ-తాంసి

ఉపాధ్యాయ సాధారణ బదిలీలు పాఠశాలల కేటగిరీలు పూర్వ పద్ధతిలో కొనసాగించాలని కోరుతూ బుధవారం భీంపూర్ మండల ఉపాధ్యాయులు జిల్లా విద్యాధికారి ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 2018 సంవత్సరంలో బదిలీల సందర్భంగా పాఠశాలలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి ప్రాధాన్యత పాయింట్లను కేటాయించారు. ప్రస్తుత బదిలీల్లో పాఠశాలలను హెచ్ఆర్ఏ ప్రకారంగా మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తున్నారని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి బస్సు రవాణా రోడ్డు సదుపాయంలేని మారుమూల గ్రామాలలో పనిచేస్తున్నామని అన్నారు. నాలుగు కేటగిరీల రద్దు వలన సంవత్సరానికి ఐదు ప్రాధాన్యత పాయింట్లు కోల్పోయి తీవ్ర అన్యాయనికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నామని అన్నారు. పాఠశాలల కేటగిరీలను నాలుగుగానే కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ తిరుపతి, అశోక్, రాజు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలతోనే గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-సిరికొండ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే రేఖశ్యామ్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఫకీర్ నాయక్ తండా, తుమ్మల్ పాడ్, ధర్మసాగర్, లెండిగూడ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరి వికాసం కింద వ్యవసాయం కోసం కరెంట్ సౌకర్యం, బోర్లను, సబ్సిడీ రుణాలను అందజేస్తోందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు లక్ష్మి దినేష్, గోవర్ధన్, బిక్కు, చేండే బాలాజీ, సునీల్, బషీర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



ఆదిలాబాద్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.భరద్వాజ విద్యార్థులతో బోధన, బోధనేతర సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు ప్రాముఖ్యతను వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొని రాష్ట్ర, జాతీయ అభివృద్ధిలో పాత్రులు కావాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో సర్పంచ్ విరేష్ కుమార్ సమక్షంలో, న్యూలోలం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణల ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. మన ఓటు మన దేశ, రాష్ట్ర, గ్రామ అభ్యున్నతికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, డిప్యూటీ తహసీల్దార్ పుష్పలత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, సంతోష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, విద్యార్థులు న్యూలోలం గ్రామ ఉపసర్పంచ్ నరేందర్, పంచాయతీ కార్యదర్శి దిలీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో... మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన కూడలిలో జెడ్పీఎస్-ఎస్, కస్తుర్బా పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రధాన కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పాడ్డారు. ఉపాధ్యాయులు ఓటు వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించారు. గొల్లమాడ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ చెన్న మహేష్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. గ్రామ ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ అరుగు మీది రాంరెడ్డి, ఎంపీపీ రేఖ రమేష్, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుభీర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని మండల తహసీల్దార్ విశ్వంబర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ విశ్వంబర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులకు ఓటు హక్కులేని వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. దీంతో గ్రామంలో ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు నమోదు చేసుకునేలా ప్రతి ఒక్క విద్యార్థి గ్రామంలో తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, ఎంపీడీఓ కవిరాజ్, కళశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్, కళశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే బాధ్యత ప్రతి యువతీ, యువకులపై ఉందని తాంసి, భీంపూర్ తహసీల్దార్‌లు శ్రీదేవి, మహేంద్రనాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు అధికారులు వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులతో గ్రామస్తులతో కలిసి కూడలిలో సమూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఓటరు నమోదు దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారి ఓటును రెవెన్యూ సిబ్బంది. వీఆర్ఏలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రతి గ్రామంలో ఇంటింటికీ వచ్చి నమోదు చేసుకుంటారని అన్నారు. ఓటు హక్కు ఒక ఆయుధం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, లింబాజి, జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, ఎస్సై దనశ్రీ, అంగన్‌వాడీ పాల్గొన్నారు

నార్నూర్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని కళాశాల విద్యార్థిని, విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు: 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న నూతన పాఠశాల భవనాన్ని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ రమాకాంత్, గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, పాఠశాల చైర్మెన్ గంగన్న, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, రెవెన్యూశాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులందరూ కలిసి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. ఈ సంధ్బంగా జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అత్యంత కీలకమైందని అన్నారు. ఈ ఓటుతో అవినీతిని అంతంచేసి నీతివంతమైన పాలన అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో..

సిరికొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. 18 సంవత్సారాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ పెంటన్న పాల్గొన్నారు.

అదిలాబాద్ రూరల్: ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రజలకు అందించిన గొప్ప ఆయుధమని తహసీల్దార్ శివరాజ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం ఓటరు ప్రముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం కచ్‌కంటి గ్రామంలో 13వ జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు.

నిర్మల్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ నుండి జయశంకర్ విగ్రహం వరకు విద్యార్థులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించడంతో పాటు 17 సంవత్సరాలు నిండిన యువత ముందస్తుగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని అన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ బోర్కడే, రాంబాబు, డీఆర్ఓ లోకేష్, ఆర్డీఓ స్రవంతి, డీఈఓ రవీందర్‌రెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

దీపాయిగూడ పోస్ట్‌మాస్టర్ ఇంట్లో చోరీ



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని దీపాయిగూడ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గ్రామ పోస్టు మాస్టర్ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఉదయం వెలుగులోకి వచ్చింది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోస్ట్ మాస్టర్ సురేందర్‌రెడ్డి ఇంట్లో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఇంట్లో రెండు గదులు ఉండగా ఒక గదిలో వారు పడుకున్నారు. మరొక గదిలో వారి సమకూర్చుకున్న డబ్బు, నగలు ఉంచినట్టు పేర్కొన్నారు. మంగళవారం గుర్తు తెలియని దుండగులు, అర్ధరాత్రి వారు పడుకున్న సమయంలో బీరువాని పగలగొట్టి 13 తులాల బంగారం, రూ.20వేలను దొంగలించారని తెలిపారు. గ్రామంలోని సీసీ కెమెరాకు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కనిపించారని అన్నారు. వీరు ఎక్కడి నుండి వచ్చారు ఎలా వచ్చారన్నదానిపై సురేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డిమాండ్లను రాష్ట్రపతికి నివేదించాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తమ డిమాండ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ సంయుక్తా కిషన్ మోర్చ ఆధ్వర్యంలో వామపక్ష ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని అన్నారు. 2022 విద్యుత్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఎత్తివేయడం వల్ల 80 శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. అందువల్ల బ్యాంకుల్లో ఉన్న రైతుల అప్పులను మాఫీ చేయాలని అన్నారు. లఖీంపూర్ కేసులో మరణించిన రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. రైతులపైన పెట్టిన కేసులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా సొమ్మును కేంద్ర, రాష్ట్రాలు చెల్లించాలని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి, దేవిదాస్, వెంకటనారాయణ ఉన్నారు.

రిపబ్లిక్ దినోత్సవ వేళ రాజ్యాంగ నిర్మాతకు అవమానం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని మల్లాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని అంబేద్కర్ చిత్రపటానికి అవమానం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ముఖానికి ఎరుపు రంగుపూసి అవమానించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. దుండగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోన్ సీఐ రాంనర్సింహా రెడ్డి, ఎస్సై రాహుల్ గైక్వాడ్ సంఘటన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని, కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

హామీలు అమలు పర్చడంలో కేంద్రం విఫలం

బేల : ఎన్నికల సమయంలో దేశ ప్రజానికానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. బుధవారం మండలంలోని బాది గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వంట గదిని పరిశీలించి, వస్తువుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తూ అందరి అభివృద్ధికి పాటు పడుతోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నియంత్రణ, జీరో అకౌంట్‌లలో పదిహేను లక్షల జమ, రెండు కోట్ల ఉద్యోగాల వంటి హామీలను కేంద్రం నేరవేర్చిందా అని ప్రశ్నించారు. ఈ విషయాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. హామీల అమలులో కేంద్రం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో బుధవారం ఆర్ఎంపీ, పీఎంపీల క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు రామోజీ వీరచారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శంకర్, జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు కావేటి రమేష్, ఉపాధ్యక్షుడు కంతి బోజరెడ్డి, మండల అధ్యక్షుడు లక్కం మల్లేష్ యాదవ్, గజనంద్, కిషోర్, ఓంప్రకాష్, శశి కాంత్, మారుతి, ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

ఖానాపూర్ రూరల్ : పట్టణంలోని శ్రీ సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. 26వ వార్షికోత్సవం పురస్కరించుకొని బాబాను దర్శించుకున్న భక్తులు సమర్పించుకున్న కట్న కానుకలు ఈ సందర్భంగా లెక్కించారు. రూ.4లక్షల 4వేల 3వందలు నగదు రూపంలో వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్‌తో పాటు కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహనా ర్యాలీ

నవతెలంగాణ-నేరడిగొండ

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ని పురస్కరించుకొని బుధవారం కుమారి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరు ధాన్యాల అవగాహన రోడ్‌షో, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ వ్యవసాయ సహాయ సంచలకులు శ్రీధర్ స్వామి హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల పంటలను సాగు చేయాలని అన్నారు. తక్కువ పెట్టుబడి తక్కువ పంటకాలంలో ఎక్కువ లాభాలు పొందవచ్చు అన్నారు. చిరుధాన్యాలు అరికేలు, రాగులు, సజ్జలు, సామలు, కొర్రలు, ఎండు కొర్రలు, ఉదలు జొన్నలు, వరిగెలు పంటలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. సంతానలేమి, జీర్ణ సంబంధ సమస్యలు, నరాల బలహీనత, మధుమేహం సమస్యలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గడ్డం భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ మందుల రమేష్, ఎం.పీటీసీ సవిత చంద్రశేఖర్, ఏఈఓలు సాయి కీర్తన, సౌజన్య, జైపాల్, గజేందర్, రైతుబంధు సమితి గ్రామ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బాసరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

వసంత పంచమి పురస్కరించుకొని బాసరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న అదిలాబాద్ ప్రయాణ ప్రాంగణం నుండి ఉదయం 5 గంటలకు మొదటి ట్రిప్, మధ్యాహ్నం 2 గంటలకు మరో సర్వీస్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అక్షరాభ్యాసం చేసుకునే వారితో పాటు సరస్వతి దేవి దర్శనార్థం వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

28న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

లోక్ సభ, శాసనసభ నిర్వహణ తేదీలు ఖరారైనందున ఆదిలాబాద్ జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీలో మార్పు చేసినట్టు జెడ్పీ సీఈఓ గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించినట్లు ఫిబ్రవరి 3 నుంచి కాకుండా ఈ నెల 28వ తేదీన శనివారం సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కంటి వెలుగుపై విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్



జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విస్తృత ప్రచారంతో పాటు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 33 కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి రోజుకు సుమారు 5700 మందికి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో 16 నుండి 17 శాతం మందికి రీడింగ్ గ్లాసులు తక్షణమే అందిస్తున్నామని అన్నారు. పదిశాతం మందికి ప్రిస్క్రిప్షన్ కలిగిన అద్దాలకు ఆన్‌లైన్ ద్వారా ఇండెంట్ పంపడం జరుగుతున్నదని తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ అద్దాలను స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అడల్ట్ వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టరేట్, ఎస్పీ, కోర్టు కాంప్లెక్స్, విలేకరులకు వారికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి అరవింద్ కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎన్. భీమ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధులో రాజకీయ జోక్యం తగదు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం తగదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ నటరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా దళితబంధును అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు ఇవ్వడం ఫలితంగా రాజకీయ కార్యకర్తలకు మాత్రమే లబ్ది చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందాల్సి ఉండగా నాయకుల జోక్యం వల్ల రాజకీయ పలుకుబడి కలిగిన వారికి మాత్రమే దక్కుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. దళితబంధు పథకంలో రాజకీయ జోక్యం లేకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి, అర్హులైన లబ్ధిదారులకు ఆ పథకాన్ని అందించాలని కోరారు. బడ్జెట్‌లో దళితబంధుకు ప్రభుత్వం కేటాయించిన రూ.17 వేల ఏడు వందల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి గాను ప్రతి నియోజకవర్గం నుండి 15 వందల మంది లబ్దిదారుల చొప్పున ఎంపిక చేయాల్సి ఉండగా ఆదిశగా అడుగులు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితబంధుకు కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. అలాగే రాజకీయ జోక్యం లేకుండా దళితబంధు పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పవార్ జితేందర్, 5వ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఆశలత, జిల్లా కమిటీ సభ్యులు ఆశ బాయి, ఈ.అనిత, కే.వందన, కే.ఆశన్న, ఇమాన్ బాయి, లక్ష్మీ బాయి, సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. బుధవారం రిమ్స్‌లో ప్రభుత్వ కాంట్రాక్టు పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు గత 8నెలలుగా వేతనాలు చెల్లించకుండా వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వారి 8 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో జమజేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఛాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న స్టాఫ్‌నర్స్‌లకు బుధవారం సీఐటీయూ పక్షాన మద్దతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్ నర్స్‌లకు ప్రతినెల వేతనం చెల్లించకుండా, ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం జరుగుతుందని అన్నారు. పేదలకు వైద్య సేవలు అందిస్తున్న వారి పట్ల ప్రభుత్వం ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేధనతో కూడా వారు తమ విధులు నిర్వహించడాన్ని అభినందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, డీఎంఈ వెంటనే స్పందించి, వారి 8 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా వారందరిని, ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యూలర్ చేయాలని అన్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాన్ని వారి ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ కుమార్, రిమ్స్ జేఏసీ నాయకులు మల్లయ్య, రిమ్స్ యూనియన్ కార్యదర్శి పెర్కా దేవదాస్, రిమ్స్ నాయకులు, ఆర్ సురేందర్, పోచ్చన్న, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట లభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసి, ఫిబ్రవరి 15లోగా సిద్ధం చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న సమీకృత కలెక్టరేట్ సముదాయ పనులను కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో అన్ని ప్రభుత్వశాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు వేగవంతంగా అందుతాయని తెలిపారు. పనుల నిమిత్తం కలెక్టరేట్ భవనానికి వచ్చిన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా భవన ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్‌కు సంబంధించిన టవర్స్, రహదారుల నిర్మాణం, గ్రౌండింగ్, కాంపౌండ్ వాల్, లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. భవనంలోని అన్ని గదులకు తాగునీరు అందే విధంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈలోగా సీఎం కేసీఆర్‌తో నూతన కలెక్టరేట్ ప్రారంభించేందుకు తేది, సమయం, ముహూర్తం ఖారారు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నూతన సమీకృత భవన అన్ని గదులు, ఆవరణలో ఏర్పాటు చేస్తున్న నిర్మాణం పనులను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



రేపు ఈజ్‌గాం శివరాత్రి జాతర వేలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్ గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో ఫిబ్రవరి18న నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతరలో కొబ్బరికాయలు, ప్రసాదాలు, తైబజార్, పాలుపత్రి విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణ, వాహనాల పార్కింగ్, బియ్యం, బెల్లం విక్రయ హక్కుల కోసం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో దశలవారిగా వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పాస్పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలను డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కోటపల్లిజి

చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య సేవలు, శస్త్ర చికిత్స, స్త్రీలకు సంబంధించిన(గర్భిణీ, గర్భాశయ సమస్యలకు), కంటి వైద్య సేవలు, ఎముకలు, కీళ్ల వైద్య సేవలు అలాగే బీపీ, షుగర్, పక్షవాతం, దమ్ము, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, అన్ని రకముల గడ్డలు, వరిబీజము, థైరాయిడ్ (గొంతుపై గడ్డలు), రొమ్ముగడ్డలు, దీర్ఘకాలిక పుండ్లు, కాళ్ళ మీద రింగు చుట్టుకొని ఉన్న నరాలు, కడుపులో గడ్డలు, శరీరంపై కంతులు, బీజకుట్టు(హెర్నియా) అన్ని రకాల వ్యాధులకు ఉచిత కన్సల్టేషన్ ట్రీట్మెంట్ చేయబడును అని అన్నారు. గ్రామ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 9.30కి వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని అన్నారు.

ఓటర్లు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్య విలువలను ఓటర్లు కాపాడాలని దాని కోసం పాలకులను ఎన్నుకోవడానికి కల్పించిన ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలక్టరేట్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 13వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అధికారులతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ చౌక్ వరకు అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అధికారులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు ప్రజాస్వామ్య విలువలు కాపాడే విదంగా ఉండాలన్నారు. జిల్లాలో ఓటరు జాబిత పూర్తయిందని ఓటర్ ఐడి కార్డు ఉన్నంత మాత్రాన ఓట్లు ఉన్నట్లు కాదని జాబితాను ఒకసారి పరిశీలించుకోవాలని అన్నారు. ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్య భారతదేశంలో జాతీయ నాయకులు ఓటర్ విధానంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలో సీనియర్ ఓటర్లు ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వైరాగడ శంకర్, తుకారం, లక్ష్మి, భూదేవి, నూతనంగా ఓటు నమోదు చేసుకున్న నిహారిక, దేవేందర్ లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, అధ్యాపకులు వినోద్, శ్రీనివాస్, సతీష్, హరిదాస్, వేణుకుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కవి గుండేటి యోగేశ్వర్ ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల దినోత్సవం ఆడియో పాటను వినిపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గయ్య, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, ఉదయ్, మనోహర్, వర్మ, సునీతాదేవి, నీల్ కమల్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలో బుధవారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రివిలేషన్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల సంఘం ట్రస్మా జిల్లా గవర్నింగ్ బాడీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్ రావు మాట్లాడుతూ రోజు రోజుకు రాజకీయాలు దిగజారుతున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకొని మెరుగైన సమాజనిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి సురభి శరత్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కస్తూరి పద్మచరణ్, దామెర్ల సిద్ధయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి ఉదారి చంద్రమోహన్ గౌడ్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గోపతి సతయ్య, సాంస్కృతిక కార్యదర్శి కొమ్ము దుర్గాప్రసాద్, స్పోర్ట్స్ సెక్రెటరీ పెంచాల శ్రీధర్ పాల్గొన్నారు.

దండేపల్లి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ హనుమంతరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేశం, ఎంఈఓ రవీందర్‌లు డిప్యూటి తహసిల్దార్ విజయ, ఆర్ఐ గుమ్మల రంజిత్ కుమార్, రెవెన్యు సిబ్బంది, ఐకెపి సిబ్బంది, బిఎల్వో లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం : 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని తపాలాపూర్ సర్పంచ్ నైనాల తిరుపతి పేర్కొన్నారు. బుధవారం తపాలపురం గ్రామంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఓటును అమ్ముకోకుండా నీతి నిజాయతీతో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

తాండూర్ : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌తో కలిసి మండల పరిషత్, రెవెన్యూ ఐకెపి, ఉపాధి హామీ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని చంద్రపల్లి అంగన్‌వాడీ టీచర్ శారద ఉత్తమ బీఎల్‌ఓగా కలెక్టర్ భారతి హోళికేరి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.

లక్సెట్టిపేట్ : ఓటుతోనే బలమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని, ఓటు హక్కు ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని తహసీల్దార్ జ్యోత్స్న పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్యం లో ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం మన దేశంలో 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కాసుల రవీందర్, ఆర్ఐ సంజీవ్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టి ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ అక్కెపల్లి లక్ష్మీ, ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

భీమారం : ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది ఓటు ఒక్కటేనని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహసీల్దార్ వాసంతిలు కలిసి పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంవగా మండల కేంద్రంలోని ప్రధాన కుడళ్ళతో పాటు మంచిర్యాల చెన్నూర్ జాతీయ రహదారిపై ఓటు ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అనేది ప్రతీ వ్యక్తికి గొప్ప ఆయుధం వంటిదని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం త్రియంభకేశ్వర్, ఆర్ఐ అరుణ పాల్గొన్నారు.


భీమారంలో..


రామకృష్టాపూర్‌లో..


మంచిర్యాలలో..



తాండూర్‌లో..

హాత్‌సే హాత్ జోడో యాత్రకు కార్యకర్తలు సిద్ధం కావాలి



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామం నుంచి ప్రారంభించేందుకు బుధవారం ఆ గ్రామాల్లో ముందస్తుగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల అప్పుడు ఇచ్చిన ఏ హామీ ఒక్కటి కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదన్నరు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కొలువులు దక్కుతాయని నమ్ముకున్న యువతకు మోసమే జరిగిందన్నరు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫసివుల్లా, ఉపాధ్యక్షుడు అంబటిపెల్లి మహేష్, కార్యదర్శి తిరుపతి లకావత్, వార్డ్ మెంబర్ గంగన్న యాదవ్, సీనియర్ నాయకులు తాటికొండ శ్రీనివాస్, పద్మారావు, విలాస్, పి.భూమయ్య, పాదం రాకేష్, పి.నరి, మౌలా బకాష్, సోషల్మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, యువజన కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్, అబ్దుల్ ముజ్జు, మహేష్ యాదవ్, రాహుల్ గుగులావత్ రవి పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో వరిలో అధిక లాభాలు



నవతెలంగాణ-తాండూర్

వరి నాట్లు లేకుండా నేరుగా వెదజల్లే పద్ధతిలో వరివిత్తడం వల్ల అధిక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు. బుధవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలోని బర్ల అంకయ్య అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు విధానాన్ని రైతులకు వివరించారు. వ్యవసాయ క్షేత్రంలోని వాస్తవ పరిస్థితులను పరిశీలించిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసుకున్నట్లయితే నాటు వేత నారుముడి ఖర్చు ఉండదని తెలిపారు. పిలకల సంఖ్య ఎక్కువగా వచ్చి పైరు ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ నీటితో వర్డి సాగు చేయవచ్చు అని తెలిపారు. పంట పొలాన్ని జాగ్రత్తగా చదును చేసినట్లయితే కలుపు సమస్య ఉండదన్నారు. ఆమెతో కిష్టంపేట ఏఈఓ శంకర్, రైతులు పులి శెట్టి సత్తయ్య, మల్లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీఎంకు వినతి



నవతెలంగాణ-నస్పూర్

పెండింగ్‌లో ఉన్న బిట్ షార్ప్‌నర్ల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఓ టు జీఎం త్యాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ నాయకులు మాట్లాడుతూ ప్రతినెల వస్తున్న ఇన్సెంటివ్ అదర్స్(కామన్ వర్కర్) లిస్టులో కాకుండా కాల్ కట్టర్స్‌తో అన్ని మిషన్లపైన యావరేజ్ ఇన్సెంటివ్ ఇవ్వాలని తెలిపారు. అలాగే డస్ట్ ఎలెవెంట్స్ ఇవ్వటం లేదని గత కొన్ని సంవత్సరాల క్రితం గ్రీవెన్స్ డేలో అధికారులకు తెలిపిన ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. రక్షణలో భాగంగా తలకు ఫుల్ హెల్మెట్, బైక్ హెల్మెట్, రక్షణ పరికరాలు సమయానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్ఫేస్‌లో చలి తీవ్రత ఎక్కువ ఉన్నందున చలి కోట్లు కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, ఎస్ఆర్పి1 ఫిట్ సెక్రటరీ సుధాకర్, బిట్స్ షార్ప్‌నర్స్ జాకీరుద్దీన్, సత్తయ్య, సంపత్ పాల్గొన్నారు.

దేవునిగూడలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడ గ్రామపంచాయతీలో బుధవారం సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ముగ్గుల పోటీలు జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు రూ.1500 మొదటి బహుమతి, రూ. వెయ్యి ద్వితీయ బహుమతిని అందించడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.



పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని అప్పపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు నివారించడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ఉపయోగించుకొని పశుగ్రాసం పెంచి పశువులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జంతు హింస నివారణ సంఘం పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ జంతు సంరక్షణ అవగాహన కార్యక్రమాలు జనవరి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కుక్కలు పిల్లులు ఆవులు లాంటి వాటికి ఆహారం తాగునీరు అందించి మానవతను చాటుకోవాలని సూచించారు. పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్య శిబిరంలో భాగంగా మొత్తం 300 పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యఆధికారి డా.మురళికృష్ణ, సర్పంచ్ బాబురావు, ఎస్సై గంగన్న, నంబయ్య, రైతులు, పశువైద్యసిబ్బంది నాగన్న, రాజు, పురుషోత్తం, గజానాండ్ పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-రామకృష్టాపూర్

కంటి వెలుగు కేంద్రాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక తిలక్‌నగర్ రెండవ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ అధ్యక్షతన సింగరేణి డిస్పెన్సర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మూడు రోజులపాటు నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సంతోష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాకుబ్ అలీ, గాండ్ల సమ్మయ్య, డాక్టర్ మానస నాయకులు గోపురాజం, యువ నాయకులు రాజేష్, లక్ష్మీకాంత్, డాక్టర్ శ్యామల, డాక్టర్ శివ ప్రతాప్, ఆర్పి ముంతాజ్, పుష్ప, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు రుణ సదుపాయం

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మహిళ సంఘాలు ఆర్థికంగా స్వావలంబనకు రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతోందని, ఆ దిశగా 100 శాతం లక్ష్యాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఐకేపీ, బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీడబ్ల్యూడీ మహిళ సంఘాలకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని, బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలలో మేళాలు నిర్వహించి మహిళలకు రుణాలపై అవగాహన కల్పించాలని, తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు.. స్త్రీ నిధి రుణాలు అందించేందుకు, సోలార్ విద్యుత్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళ సంఘాలు తీసుకున్న రుణాల రికవరీ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. బ్యాంకు లింకేజీలు, రికవరీలను ఫిబ్రవరి 15వ తేదీలోగా పూర్తి చేయాలని, స్వయం సహాయక సంఘాలకు మండలాలలో యూనిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ట్రాన్స్‌కో డీఈ వాసుదేవ్ పాల్గొన్నారు.

పాఠశాలలో హిందీ భాషపై టీఎల్ఎం ప్రదర్శన

జన్నారం : మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు హిందీ భాషకు సంబంధించిన టీఎల్ఎం (టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్) ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ పాఠశాల పిల్లలు తయారుచేసిన వివిధ రకాల ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. మనకు నిజ జీవితంలో హిందీకి ఎలాంటి ప్రాధాన్యత ఉందో తెలిపారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు పెట్టిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, తహసీల్దార్ ఇటిక్యాల కిషన్, ఎంఈఓ నడిమెట్ల విజయ్ కుమార్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ఎస్జీటీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు వెలువరించిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో బాలికల పాఠశాల ఆవరణలో బుధవారం వివిధ సబ్జెక్టులకు సంబంధించి పదోన్నతులు కల్పించడానికి కట్ ఆఫ్ డేట్ ప్రకారం ఎస్జీటీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 350 మంది ఉపాధ్యాయులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసచారి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. వివిధ మండలాల నుండి వచ్చిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాలు అవసరమైన సమాచారాన్ని అందించడానికి ప్రయత్నం చేశారు.

నిరుపేదలకు భరోసా సీఎం రిలీఫ్ ఫండ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. బుధవారం మండలానికి చెందిన 12 మంది లబ్దిదారులకు రూ.2.25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఏటా సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. కార్పొరేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకుని బిల్లులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్న పేదలను ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, వైస్ ఎంపీపీ స్వదేశ్ శర్మ, సర్పంచ్ బొట్లకుంట మల్లేష్, నాయకులు నికూరె నాగేందర్, కల్లెపల్లి రాజన్న, బొమ్మెల కిషన్, మౌల్కార్ లక్ష్మణ్, ధర్ని రామన్న, సిరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 26 జనవరి 2023

డంప్ చేస్తున్న హాస్టల్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

గిరిజన సంక్షేమ వసతి గహాలకు చెందిన బియ్యాన్ని మండల కేంద్రంలోని జీసీసీ గోదాంకు (టీఎస్‌ఓ 1యుసీసీ 5003) అనే నంబర్ గల ప్రభుత్వ వ్యాన్‌లో తరలించి బుధవారం సాయంత్రం అక్రమంగా డంప్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదివాసీ నాయకులు మెస్రం రాజ్ కుమార్, పెంద్రం రాజేశ్వర్‌లు పట్టుకున్నారు. అనంతరం రెవెన్యూ, పోలీసులకు సమాచారమందించారు. వెంటనే ఆర్ఐ బానుచందర్ జీసీసీ గోదాం వద్ద వచ్చివ్యాన్‌లో ఉన్న 20 బస్తాలు (10క్వింటాళ్ల బియ్యం)లో పాటు స్టూడెంట్లు ఉపయోగించే టూత్ పెస్ట్‌లు, దువ్వెనలు ఇతర వస్తువులను స్వాదీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మంచిర్యాల జిల్లా దేవాపూర్ నుండి అక్రమంగా హాస్టల్ బియ్యాన్ని తరలించి విక్రయిస్తున్నారని, ఇందులో ప్రమేయం ఉన్న ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని అదివాసీ సంఘాల నాయకులు రాజ్‌కుమార్, రాజేశ్వర్ డిమాండ్ చేశారు.

బాధితులకు ఆర్కే-7 గని కార్మికుల ఆర్థిక సాయం

నస్పూర్ : తల సేమియా వ్యాధిగ్రస్తుల కుటుంబానికి, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్ కే7 గని సైకిల్ షెడ్ కాపరి కుటుంబానికి శ్రీరాంపూర్ ఏరియా జీఎం చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని ఆ గని కార్మికులు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆర్కే7 గని కార్మికులు మానవత్వం కలిగి ఉన్న వ్యక్తులని, ఇతరులకు కష్టం వస్తే మేమున్నామని భరోసాతో ఆర్థిక సాయం చేయటం గొప్ప విషయమని పేర్కొన్నారు. అందరూ మన కుటుంబ సభ్యులుగా భావించి ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేస్తున్న గని కార్మికులకు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న 10 సంవత్సరాల చిన్నారి గౌసియా కుటుంబానికి రూ.50 వేలు, సైకి షెడ్‌లో కాపరిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తూ ఇటీవల మరణించిన ఎల్లారెడ్డి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ గోవిందరాజు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, ఆర్కే7 గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి మెండె వెంకటి పాల్గొన్నారు.

నాగోబాకు మెస్రం వంశీయుల వీడ్కోలు

- బేతాల్ నృత్యం, కర్ర సాము ఆట
- మండ గాజలింగ్ పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన కేస్లాపూర్ నాగోబా కు చివరి రోజున వారి సాంప్రదాయ పూజలతో ముగింపు పలికారు. బేతాల్ నృత్యంనాగోబా సన్నిధిలోని గావడ్ ప్రవేశ ద్వారం వద్ద మెస్రం వంశీయులు పటేల్ వెంకట్ రావ్, ఖటోడ, (పూజారి) కోసు, ధర్ము, కొత్వాల్ తిరుపతి లకు వారి సాంప్రదాయ ప్రకారం తమల పాకును వేసి పాదాభివందనం చేశారు. ముందుగా పటేళ్లకు పాదాలను కడిగి బేతాల్‌పూజలో ఆహ్వానించారు. వారి సాంప్రదాయ వాయిద్యాలు కాలికోమ్, పేప్రే, డోలును వాయిస్తూ కాగడాలను వెలిగిస్తూ పటేల్ వెంకట్ రావ్, ప్రధాన్‌లు తిరుపతి, దాదేరావ్‌లు వేర్వేరుగా నాలుగు దిక్కుల్లో నమస్కరించి చేతిలో వెదురు కట్టెను పట్టి కర్రసాము ఆటను ఆడారు. అనంతరం మెస్రం పురుషులు, మహిళలు కలిసి బేతాల్ నృత్యం చేశారు.

మండ గాజలింగ్‌పూజ...

జాతరలో సతిదేవతకు సమర్పించిన కుడకలు, కొబ్బరి, కట్నం కానుకలను కీతాల వారిగా అందజేశారు. నైవేద్యం వండిన కొత్త కుండలను పటేల్ ఆడపడుచులకు అందజేశారు. దీనితో కేస్లాపూర్ నాగోబాకు వీడ్కోలు పలికి ఉట్నూర్ మండలం శ్యాంపూర్ బుదుందేవ్ జాతరకు బండేనక బండి కట్టి పయనమయ్యారు.

లింగ వివక్షకు తావివ్వొద్దు : సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

సమాజంలో లింగ వివక్షతకు తావివ్వకుండా, లింగ బేదం లేకుండా సమాన స్థాయిలో చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ, పురుషులను సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రక్షణ చట్టాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాంటి సమాచారం తెలియక వివక్షతకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ చట్టాల గురించి మహిళలతో పాటు పురుషులకు కూడా తెలియాల్సి ఉందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని వివరించారు. బాలికల ఆత్మ రక్షణ కొరకు ప్రత్యేక శిక్షణలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభిచడం జరిగిందని తెలిపారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ లింగ వివక్షతను రూపుమాపడానికి చర్యలు చేపట్టాలని, తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ బాలికలు ప్రణాళికలతో కూడిన లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా గమ్యం చేరుకోవాలని అన్నారు. 33 శాతం రిజర్వేషన్ మహిళలకు కలిపించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు బాలికల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నదని గుర్తుచేశారు. యుక్త వయసులోనే బాలికలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో మహిళా అధికారులు ఎక్కువగానే ఉన్నారని ఆయన గుర్తుచేశారు. జిల్లా సంక్షేమ అధికారి మిల్కా మాట్లాడుతూ ఆడపిల్లల గురించి అవహేళన చేయకుండా ఉండాలని, బాలికలు తన విద్యను కొనసాగిస్తూ ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. కుటుంబంలో మగ పిల్లలతో పాటు ఆదర్శంగా నిలవాలని అన్నారు. వివిధ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆత్మ రక్షణ శిక్షణలను ప్రదర్శించారు. విద్య, కరాటే, నృత్యం, చిత్రలేఖనం, మ్యూజిక్, క్రీడలు, తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ, సీడబ్ల్యూసీ చైర్మెన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే



జైనథ్ : గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని కాప్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే జోగు రామన్న ప్రారంభించారు. మొదట మాల సంక్షేమ సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.50 లక్షలతో గీత మందిరం కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. అలాగే నంద మైసమ్మ ఆలయానికి భూమిపూజ చేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు నాయకులు ఆలయం పేరుతో ఓట్లు దండుకునే పనిలో పడటం హాస్యస్పదంగా ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఆలయాల నిర్మాణాలు చేపట్టడంలో ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. ప్రతి గ్రామాలలో అన్ని కుల సంఘాలను గౌరవిస్తూ, తెలంగాణ ప్రభుత్వం ఆలయాల నిర్మాణాలను చేపట్టి, భక్తి భావాలను పెంపొందిస్తోందని అన్నారు. గత పాలకులు ఎక్కడైనా ఆలయాల నిర్మాణం చేపట్టారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బీజేపీ ఒకే ఒక్క రామ మందిరం నిర్మించి, ఓట్ల అడగటం ఎంతవరకు సమంజసమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి గ్రామాలలో చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. రైతుబంధు రూ.63లక్షలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. అలాగే రైతు బీమా ఐదు లక్షల రూపాయలను అందజేస్తోందని అన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో కూడా వీటిని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, రైతుబంధు నాయకులు లింగారెడ్డి, సర్పంచ్ ఎల్టీ రమీల వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, ఎంపీటీసీ ఇందిరా రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వేణుయాదవ్ పాల్గొన్నారు.

వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని స్థానిక ఏఎస్ఐ రాథోడ్ బిక్కు నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రేండ్లగూడ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, ధ్రువపత్రాలు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, లైసెన్స్, ఆర్సీ కలిగి ఉండాలన్నారు.

సమీపిస్తున్న గడువు..సహకరించని సర్వర్

- నవోదయ ప్రవేశానికి దరఖాస్తుదారులకు తిప్పలు
- ఇప్పటికి దరఖాస్తు చేసుకున్నది కేవలం 1278 మంది మాత్రమే
- గడువు పొడిగించాలని కోరుతున్న తల్లిదండ్రులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు మాత్రమే గడువు ఉంది. దరఖాస్తు గడువు తేదీ దగ్గర పడుతుండడం, అదే సమయంలో ఆన్‌లైన్ సర్వర్ బిజీగా ఉండడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పిల్లలతో ప్రవేశపరీక్ష రాయించి ఎలాగైనా విద్యాలయంలో సీటు సంపాదించుకోవాలని ఆరాటపడే విద్యార్థుల తల్లిదండ్రులు ఆదిలోనే కష్టాలను ఎదుర్కొంటున్నారు.

2023-24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల ఒకటో తేదీ నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి శ్రీకారం చుట్టింది. కేవలం నెల రోజులే మాత్రమే గడువు తేదీని ప్రకటించారు. గతంలో రెండు నుండి మూడు నెలల గడువు ఇవ్వడంతో అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి కష్టాలు లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు వీలు ఉండేది. ప్రస్తుతం ఈ నెల ఒకటితో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై ఈ నెల 31తో ముగియనుంది. గత నెలలో ఈ విద్యాలయం పరిధిలో ప్రవేశ పరీక్షకు 6 వేలకు పైగా దరఖాస్తులు రాగా ప్రస్తుతం ఇప్పటి వరకు కేవలం 1,278 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు కేవలం ఆరు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉంది. నిత్యం విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాలయం ప్రిన్సిపల్‌కు ఫోన్ చేసి దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయాని ఆయన దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.

కొత్త నిబంధనలతో అయోమయం

ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన నియమ నిబంధనలు విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాయి. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కడ నివాసమున్నా, ఈ జిల్లా పరిధిలో విద్యార్థి ఐదో తరగతి చదువుతూ ఉంటే ఈ విద్యాలయంలో ప్రవేశపరీక్షకు అర్హుడుగా పరిగణించేవారు. ఇపుడు ఈ నిబంధనను మార్చి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థి ప్రవేశపరీక్ష రాసే జిల్లాలోనే నివాసముండాలనే నిబంధన విధించారు. అంతేకాకుండా ఆధార్‌ను లింక్ చేస్తుండడం చిక్కులకు గురి చేస్తోంది. ఆధార్ కార్డు చిరునామాలో పేర్కొన్న పట్టణం లేదా గ్రామంలోనే విద్యార్థి చదువుతూ ఉంటే దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. ఆధార్ కార్డు లేని వారు నివాస ధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా గతంలో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి పుట్టిన తేదీకి నాలుగేళ్ల వ్యవధి విధించారు. అంటే ఎనిమిది నుండి 12 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న వారు ఈ పరీక్ష రాసే అవకాశముండేది. ఇపుడు 11 నుండి 12 సంవత్సరాలు నిండిన వారే ఈ పరీక్షకు అర్హులు. ప్రస్తుతం 01-05-2011నుండి 30-04-2013 మధ్య జన్మించి, ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ ఉన్న వారే ఈ ప్రవేశపరీక్షకు అర్హులు. దీనితో దరఖాస్తుల సంఖ్య విపరీతంగా తగ్గే అవకాశముంది.


ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఇబ్బందులను ప్రిన్సిపాల్‌కు వివరిస్తున్న విద్యార్థి తండ్రి

తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు

చక్రపాణి-ప్రిన్సిపాల్ జవహర్ నవోదయ విద్యాలయం



ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు. సర్వర్ బిజీ కావడం వల్ల దరఖాస్తు సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. సాధ్యమైనంత వరకు గడువు తేదీలోగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌వీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చివరి వరకు సర్వర్ బీజీగా ఉంటే గడువు కూడా పొడిగించే అవకాశముంటుంది. కాబట్టి ఆందోళన చెందవద్దు.

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

- మంచిర్యాల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్



చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో బుధవారం కోటపల్లి, చెన్నూర్ మండలాల పేదలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంకె రవి, ప్రకాష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదల నోట్లో మట్టికొడుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తున్నామని చెబుతన్నా ఇప్పటి వరకు ఏ ఒక్క కుటుంబానికి ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇండ్ల స్థలాలు కూడా ఇవ్వడం లేదన్నారు. సొంత స్థలం ఉన్న వారికి ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తామని చెప్పడమే తప్ప చేతల్లో చూపించడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై అనేక దఫాలుగా ప్రజాప్రతినిదులకు, ప్రభుత్వ పెద్దలకు అర్జీలు పెట్టుకున్నా పేదలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పేదలకు పంచడానికి భూములు లేవని చెప్పే ప్రభుత్వాలు పెద్ద మనుషులు కబ్జా చేస్తున్న స్థలాలను దర్జాగా కట్టబెడుతున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న వారు ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేస్తుంటే అధికారులు పట్టిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందించని పక్షంలో పేదలతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్మ పున్నమ్, జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు, పట్టణ బాధ్యులు ఎండీ అవేజ్, మండల నాయకులు కరీం, చంద్రన్న కావిరి రవి, మారన్నతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పేదలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి : ఆర్డీఓ సురేష్

నవతెలంగాణ-ఉట్నూర్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ సురేష్ అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆర్డీఓ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకతపై తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు విద్యార్థులు తెలియజేయాలని సూచించారు. అనంతరం వృద్ధ ఓటర్లను ఆర్డీఓ, ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో తిరుమల, వైస్ ఎంపీపీ బాలాజీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీపాల్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్, మండల పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మండల కేంద్రం నుండి గ్రామ పంచాయతీ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీపాల్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఓటు బ్రహ్మాస్త్రం లాంటిదని, పౌరులందరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కును మరువద్దని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అచ్యుత్‌రావు, సిబ్బంది, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సోమిని ఆశ్రమ పాఠశాలలోనూ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీటీసీ సాయి, సర్పంచ్ శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాంకిడి : మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ రహీమొద్దీన్, సర్పంచ్ బండె తుకారాం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతపై తహసీల్దార్, సర్పంచ్ అవగాహన కల్పించారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడిందన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఓటర్లందరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇది మన బాధ్యత అని తహసీల్దార్ జమీర్ అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం కల్పించిందని, దీన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆకియాఖానం, జుగాదిరావు, ముకిమ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జైనూర్ : పాలకులను నిర్ణయించే శక్తి ఓటర్లకే ఉంటుందని లింగాపూర్ తహసీల్దార్ రాజేశ్వరి అన్నారు. బుధవారం లింగాపూర్, సిర్పూర్(యు) మండల కేంద్రాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి ఓటర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధమని, అందుకే అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అవసరమని పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్, ఆర్ఐ ప్రకాష్, ప్రదీప్, బీఎల్ఓ కళాబాయి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షకు వెళ్లిన యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్ : డిగ్రీ పరీక్ష రాయడానికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకానగర్ కాలానికి చెందిన పూజ ఈనెల 23న సోమవారం డిగ్రీ పరీక్ష రాయడానికి ఇచ్చోడలోని చత్రపతి డిగ్రీ కళాశాలకు ఉదయం వెళ్ళింది. అయితే సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ మేరకు బుధవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి చందర్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్ : గిరిజన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీఓ కె.వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇటీవల రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ క్రీడల్లో ద్వితీయ స్థానం సాధించిన గిరిజన క్రీడా పాఠశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను డీడీ దిలీప్ కుమార్‌తో కలిసి ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీలో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమని అన్నారు. జట్టులో 14 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉండటం, ఆ జట్టు రాష్ట్రస్థాయిలో గెలుపొందడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని కొనియాడారు. ఉట్నూరులో ప్రత్యేక హాకీ క్రీడా మైదానాన్ని రెండు నెలల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు ఐటీడీఏ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ప్రత్యేక డైట్‌తో పాటు హాకీ స్టిక్స్, క్రీడా దుస్తులు అందిస్తామని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను భువనేశ్వర్‌లో జరుగుతున్న ప్రపంచ హాకీ క్రీడా పోటీలను తిలకించేందుకు పంపించాలని, డీడీ దిలీప్ కుమార్‌ను ఆదేశించారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల అనుభవాలను పీఓ అడిగి తెలుసుకున్నారు. వచ్చే సంవత్సరం విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు స్వయంగా మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి కె. పార్థసారథి, ఏటీడీఓలు క్రాంతి, నిహారిక ప్రధానోపాధ్యాయులు ఉత్తమ్, శ్రీనివాస్, మధుసూదన్, హేమంత్, గోవింద్, కోచ్‌లు శేఖర్, సునంద్, శివ ఉన్నారు.

ప్రాణం పోయినా బెదిరింపులకు భయపడను : జాదవ్ వినోద్ నాయక్

ఇంద్రవెల్లి : ప్రాణం పోయినా బీజేపీ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని ఏఐసీసీ సభ్యులు జాదవ్ వినోద్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఫంక్షన్ హాలులో మారుమూల గ్రామాల ఆదివాసీ యువజన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పదవీ లేకుండా తాను ఖానాపూర్ నియోజక వర్గం ప్రజలకు సేవా చేయాలనే ఉద్దేశంతో యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తే, బీజేపీ జిల్లా స్థాయి నాయకుడు తనను బెదిరిస్తున్నాడని అన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ ప్రజల కోసం ప్రాణాలు అర్పించిందన్నారు. నేను సైతం ప్రాణాలకు భయపడనని సవాల్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఆనాడు వైయస్సార్ ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు తప్ప కేసీఆర్ ప్రభుత్వం ఒక డబుల్ బెడ్ రూం, నిరుద్యోగ భృతి ఇవ్వక మోసం చేసిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికలలో కేసీఆర్ ఇచ్చిన హామీపై యువత నిలదీయాలని వెల్లడించారు. ఈ సందర్భంగా 29 పంచాయతీ యువకులకు వాలీబాల్ కిట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెందూర్ ప్రభాకర్, సెడ్మాకి ఆనంద్‌రావు, వెంకట్‌రావు, దుధ్‌రామ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కొండగట్టు ధర్మపురి పర్యటన ముగించుకొని తిరిగి హైదరాబాద్ వెళుతున్న సమయంలో కాన్వాయిని వెంబడించి ప్రమాదవశాత్తు మృతి చెందిన యువకుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కన్వినర్లు చెట్టుపల్లి గంగయ్య, కోడూరు చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలోని వెల్గటూర్ మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కూన రాజకుమార్ తన స్నేహితుడైన జక్కుల అంజితో కలిసి పవన్ కళ్యాణ్ కాన్వాయిని వెంబడిస్తున్న తరుణంలో, కిషన్ రావు పేట స్టేజి వద్ద, వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురి కావడంతో కూన రాజ్ కుమార్ అక్కడికక్కడే మతి చెందాడాని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పందించి వెంటనే రాజ్ కుమార్ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.కోరుతున్నామన్నారు. అలాగే వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని వేడుకుంటున్నామన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు, శ్రీరాముల గంగాధర్, మామిడి విజయ్, వేయి కండ్ల రవి, వజ్జల రాజన్న అశోక్, నరేష్, రామన్న, రాజన్న, విజయ్ పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్

నవతెలంగాణ-భీమారం

ఆపదలో నిరుపేదలకు అండగా సీయం రిలీఫ్ పండ్ నిలుస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు చెరుకు సరోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలానికి చెందిన పలువురికి రూ.3.15 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న ఆయన మండల కేంద్రానికి చెందిన రామల్ల శంకర్‌కు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా శనిగారపు సబితకు రూ.15 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు ఆనారోగ్య సమస్యలతో సతమతమౌతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు జీవన భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిధి నుంచి వారిని ఆదుకుంటుందని అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఇలాంటి బాధితులకోసం ప్రత్యేక చొరవ చూపెడుతు వారికి సీఎం సహాయక నిధి చెక్కుల మంజూరుకు కృషి చేస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజ్‌కుమార్ నాయక్, నాయకులు పోడేటి రవి, జల్లంపల్లి తిరుపతి, నల్లాల రాజలింగు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

ఉద్యోగులను అభినందించిన గని మేనేజర్

నవతెలంగాణ-నస్పూర్

విజిలెన్స్ పక్షోత్సవాల సందర్భంగా సింగరేణి సంస్థ అవినీతి నిర్మూలనపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆర్కే5 ఉద్యోగులను గని మేనేజర్ అబ్దుల్ ఖాదర్ అభినందించారు. ఎన్‌సీ డబ్ల్యూ ఏ విభాగం శ్రీరాంపూర్ ఏరియాలో మొదటి, రెండో బహుమతి ఆర్కే5 గని కార్మికులు బొమ్మినేని రంజిత్ కుమార్(జనరల్ మజ్దూర్), ఎండి ఇబ్రహీం(సీనియర్ మైనింగ్ సర్దార్) సాధించారని, కంపెనీ స్థాయిలో ఎగ్జిక్యూటివ్ విభాగంలో రెండవ బహుమతి గజ్జి సునీల్ కుమార్(సీనియర్ అండర్ మేనేజర్) సాధించారని, అలాగే కన్సిలేషన్ బహుమతుల్లో రెండవ బహుమతి రెడపాక లక్ష్మీ నర్సయ్య(కోల్ కట్టర్) సాధించారని తెలిపారు. మొత్తంగా ఏడు బహుమతుల్లో నాలుగు ఆర్కే5 ఉద్యోగులు సాధించడం గర్వకారణం అని కొనియాడారు. విజేతలకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జనరల్ మేనేజర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయనున్నారు.

గాయపడిన మున్సిపల్ కార్మికునికి పరామర్శ

మంచిర్యాల : గుడిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లపల్లి భానుచందర్ అనే మున్సిపల్ కార్మికుడిని బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పరామర్శించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చైర్మన్ వెంట మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు అంకం నరేష్, తాజుద్దీన్ ఉన్నారు.